క్లుప్తంగా

కౌలురైతు కార్డుల పంపిణీ

కడియం: వేమగిరి పంచాయతీ కార్యాలయంలో బుధవారం 329 మందికి కౌలు రైతు కార్డులను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి కె.రాజశేఖర్, వీఆర్వోలు కుమారి, లక్ష్మి ఆధ్వర్యంలో వీటిని రైతులకు అందజేశారు.

వృద్ధులకు అన్నదానం

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ ఏబ్లాక్ లోని వృద్ధులకు ఆశ్రయం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ ఏకే మోహన్, వైస్ చైర్మన్ కె.బలరామ్, కోశాధికారి ఏ.కుసుమ కుమారి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ప్రతి బుధవారం వృద్ధులకు ట్రస్టు ద్వారా అన్నదానం నిర్వహిస్తామని వారు తెలిపారు.

రేపు విద్యుత్ అంతరాయం

కడియం: వార్షిక మరమ్మతుల నేపథ్యంలో కడియపులంక సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఈ నేపథ్యంలో బుర్రిలంక, కడియపులంక, పొట్టిలంక, వెంకాయమ్మపేట, దోసాలమ్మకాలనీ ప్రాంతాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదన్నారు.

సెంట్రల్ జోన్ డీఎస్పీగా రమేష్‌బాబు



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎస్పీ రమేష్‌బాబు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డీఎస్పీగా కె.రమేష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 1989 బ్యాచ్‌కు చెందిన రమేష్‌బాబు మచిలీపట్నం జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన డీఎస్పీల సాధారణ బదిలీల్లో భాగంగా సెంట్రల్ జోన్ డీఎస్పీగా నియమితులయ్యారు. ఆయన 2016 నుంచి 2018 వరకూ జిల్లా ఈస్ట్ జోన్ డీఎస్పీగా విధులు నిర్వహించారు.

ముత్యాల పోసికుమార్‌కు సత్కారం



పోసికుమార్ సత్కరిస్తున్న శ్రీనివాస్ నాయుడు

ధవళేశ్వరం: శ్రీకృష్ణదేవరాయ పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఏపీ కాపు జేఏసీ జిల్లా చైర్మన్ ముత్యాల పోసికుమార్‌ను ఘనంగా సత్కరించారు. కాపు జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. కాపుల ఐక్యత కోసం, కాపుల అభ్యున్నతి కోసం తన వంతు కృషి చేస్తానని పోసి కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కాపు జేఏసీ నాయకులు జేటి రామారావు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించాలి

కంబాలచెరువు: మానసిక రుగ్మతలతో బాధపడుతున్నవారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని, వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు తెలిపారు. ఆ బాధితులకు సంబంధించిన చికిత్సపై బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానసిక రుగ్మతలు ఉన్నవారికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. దీనిపై ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా సహకారం అందిస్తామన్నారు. ఈ విభాగంలో చికిత్స పొందుతున్న వారి వివరాలు, వారికి అందుతున్న వైద్య సదుపాయాలు, ఇతర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

సినిమాలు

శ్యామల	: రాయన్
సూర్యమినీ	: రాయన్
సూర్యప్యాలెస్	: బడ్డీ
స్వామి	: శివంభజే
శివజ్యోతి	: అలనాటి రామచంద్రుడు, ఏవరేజ్ స్టూడెంట్ నాని
అనుశ్రీ	: శివంభజే
రాజా	: తిరగబడరాసామీ
రంభ	: ఎటోవెళ్ళిపోతుంది మనసు, పురుషోత్తముడు
ఊర్వశి	: ఉషాపరిణయం
మేనక	: విరాజ్
కుమారి	: తిరగబడరాసామీ
అప్సర	: డెడ్‌పూల్ అండ్ వోల్వడిన్
అశోక	: కల్కి2898ఏడీ
నామవరం	
వీఎస్ మహల్	: శివంభజే
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: బడ్డీ, రాయన్
కడియం	
వెంకటసూర్య	: శివంభజే



గట్టుపై కర్మకాండలను నిర్వహిస్తున్న పురోహితులు



ఘాట్‌పైకి కొట్టుకొచ్చిన చెత్తాచెదారం



కోటిలింగేశ్వరస్వామి ఆలయం వెలుపల చెత్త డంపింగ్

ఓ మై ఘాట్..

- అధ్వానంగా కోటిలింగాల రేవు
- పేరుకుపోయిన బురద, చెత్త
- పట్టించుకోని అధికారులు
- పుణ్యస్నానాలకు భక్తుల అవస్థలు

సీటీఆర్ఐ: నగరంలోని ప్రముఖమైన కోటిలింగాల ఘాట్ అధ్వానంగా మారింది. ఇటీవల గోదావరికి వరద రావడంతో మెట్లను తాకుతూ నీరు ప్రవహించింది. వరద ఉధృతి తగ్గిన తర్వాత నీరు పూర్తిగా లాగేసింది. కానీ కోటిలింగాలఘాట్ మెట్లపై భారీగా బురద, చెత్త పేరుకుపోయింది. దాన్ని శుభ్రం చేయకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. స్నానాలు చేయడానికి కూడా వీలు లేకుండా మారింది. అలాగే పితృకర్మలు, పిండ ప్రదానాలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో నగరపాలక సంస్థ నిర్లక్ష్యానికి భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

గోదావరిలో పుణ్యస్నానాలు

చారిత్రక నగరం రాజమహేంద్రవరం అంటే అందరికీ గుర్తుకువచ్చేది గోదావరి. ఎక్కడెక్కడినుంచో ప్రజలు ఇక్కడి గోదావరిలో పుణ్యస్నానాలు చేయడానికి వస్తారు. వ్యాపార, వాణిజ్య కేంద్రమైన నగరానికి వచ్చిన వారందరూ గోదావరిని చూడకుండా వెళ్లరు. ఈ నేపథ్యంలో గోదావరి తీరంలో నగరంలో పలుచోట్ల ఘాట్లు నిర్మించి, వాటిని సుందరంగా అభివృద్ధి చేశారు. బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారితో పాటు స్థానికులు కూడా సాయంత్రం వేళలో ఈ ఘాట్లను సందర్శిస్తారు. గోదావరి అందాన్ని చూస్తూ సేదతీరతారు.

భక్తుల తాకిడి

శ్రావణ మాసం సందర్భంగా గోదావరి ఘాట్లలో పుణ్యస్నానాలు ఆచరించడానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు. కోటిలింగాలఘాట్‌కూ భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అయితే ఘాట్‌లో బురద పేరుకుపోవడం సమస్యగా మారింది. ఇక్కడ కర్మకాండలు నిర్వహించడానికి దేశం నలుమూలల నుంచి ప్రజలు వస్తారు. అంతేకాకుండా ఇక్కడి కోటిలింగేశ్వరస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది.



కోటిలింగాల ఘాట్‌లో పేరుకుపోయిన బురద

ఎక్కడి చెత్త అక్కడే

దేవాలయాల ప్రాంతాలలో చెత్త వేయకూడదు, ఒక వేళా చెత్త ఉన్నా వెంటనే తొలగించాలి. కానీ పవిత్రమైన కోటిలింగేశ్వరస్వామి ఆలయం వెలుపల నెల రోజులుగా చెత్తను డంపింగ్ చేస్తున్నారు. దేవాలయానికి వచ్చే భక్తులు చెత్త నుంచి వచ్చే దుర్గంధాన్ని ధరించలేక ఇబ్బంది పడుతున్నారు. అసలే వర్షాకాలం, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నా కార్పొరేషన్ సిబ్బంది, అధికారులు కళ్లు తెరవడం లేదు.

బీసీలకు రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ పెంచాలి



ఢిల్లీలో ధర్నా చేస్తున్న పద్మలత తదితరులు

రాజమహేంద్రవరం సిటీ : కేంద్ర ప్రభుత్వం బీసీల కోసం రూ.2 లక్షల కోట్ల బడ్జెట్‌ని ప్రవేశపెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత డిమాండ్ చేశారు. ఢిల్లీలోని ఆంధ్రభవన్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీసీల హక్కుల కోసం బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో బుధవారం రెండో రోజు ధర్నా కొనసాగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ పద్మలత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు ప్రత్యేక బీసీ సంక్షేమ శాఖ ఏర్పాటు చేయగా, కేంద్రంలో మాత్రం ప్రత్యేక మంత్రిత్వశాఖ లేకపోవడం దారుణమన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించాలి



సామూహిక సీమంతం చేస్తున్న సిబ్బంది

కడియం: తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ కోరారు. రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు జోత్స్న, ఐసీడీఎస్ ఏసీడీపీవో కనకవల్లి, ఎంపీడీవో రాజ్‌మనోజ్, ఏపీఎం అప్పలకొండ తదితరులు పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతర గర్భిణులకు సామూహిక సీమంతం జరిపారు. బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

వైద్య కళాశాలలో వసతుల పరిశీలన

కంబాలచెరువు: స్థానిక మల్లికార్జున్ నగర్‌లోని వైద్య కళాశాలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. అక్కడ విద్యార్థులకు, అధ్యాపకులకు అందుతున్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరంలోని బోధనా వైద్య కళాశాలలో 652 పోస్టులకు 338 భర్తీ అయ్యాయన్నారు. విద్యార్థుల ల్యాబ్స్, మెడికల్ ఎక్విప్‌మెంట్, పుస్తకాలు, ప్రాక్టికల్ రూమ్స్, టెక్నికల్ స్టాఫ్, ఫ్యాకల్టీ, వైద్య కళాశాల శాశ్వత భవనాల నిర్మాణంలో ఇబ్బంది తదితర సమస్యలు ఉన్నాయన్నారు. అల్లు రామలింగయ్య మెడికల్ కాలేజీకి సంబంధించి రాజమహేంద్రవరంలో 23, గుడివాడలో 23 సీట్లు, కడపలో 7 పీజీ సీట్లు ఉన్నాయని, వాటిని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.



వైద్య కళాశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

మురుగుకాలువల్లో సిల్ట్ తొలగించాలి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని మురుగు కాలువలలో నీటి ప్రవాహానికి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగం అధికారులకు కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. మరమ్మతులు అవసరమైతే వెంటనే చేపట్టాలన్నారు. ఆయన బుధవారం నగరంలోని ఆవ ఛానల్, అనుబంధ కాలువలను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున కాలువలలో సిల్ట్‌ను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఆవ చానల్‌లో కొన్ని చోట్ల గోడలు దెబ్బతిన్నట్టుగా గుర్తించామని, వాటికి వెంటనే తగిన మరమ్మత్తులు చేయడం జరుగుతుందన్నారు.



నగరంలోని డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులోని చేనేత సొసైటీలో బుధవారం చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీలో పనిచేస్తున్న చేనేత కార్మికులకు సత్కరించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురగంటి సతీష్, మాజీ వైస్ ఎంపీపీ గంగిన హనుమంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు తంగేళ్ల పద్మావతి, రూరల్ అసెంబ్లీ కన్వీనర్ యనాపు ఏసు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

కడియం: మండలంలోని పొట్టిలంకలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ చేనేత రంగాన్ని పనికి ఆహార పథకంలో చేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని గతంలోనే కోరానని, అయితే కేంద్ర ప్రభుత్వం సహకరించాల్సి ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా చేనేత కార్మికులకు అధునాతన శిక్షణ చాలా అవసరమన్నారు. ఇందు కోసం మురమండలో చేనేత భవన్‌ను ఏర్పాటు చేసి చేనేత కార్మికులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెలుగుబంటి నాని, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు మార్గాని సత్యనారాయణ, వైస్ ఎంపీపీ కలిదిండి విశాలాక్షి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్ కిరణ్ చేనేత సామాజికవర్గ మహిళలకు చీరలు పంపిణీ చేశారు.



కాతేరులో చేనేత కార్మికులను సత్కరిస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు

రొట్టెల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని ఇవాంజిలిన్ లెప్రసీ కాలనీలో బుధవారం సాయంత్రం చేనేత కార్మికుల సంక్షేమం సంఘం నిర్వాహకుడు మెహర్ మల్లికార్జునప్రసాద్ ఆధ్వర్యంలో రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రసాద్‌రాజు, గంగాధర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్ కళాశాలలో..

కంబాలచెరువు: శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆప్కో చేనేత వస్త్రాలయం వారితో ఎగ్జిబిషన్, అమ్మకాలు నిర్వహించారు. విద్యార్థినులతో పోస్టర్ ప్రజెంటేషన్, చేనేత వస్త్రధారణతో ఫ్యాషన్ షో పోటీలను నిర్వహించారు. పోటీలకు కళాశాల ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి డాక్టర్ బి.అనురాధ సూర్యకుమారి, కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి డాక్టర్ ఎం.సునీత, ఎకనామిక్స్ ఇన్‌చార్జి డీవీకేఎస్ లక్ష్మి, జువాలజీ ఇన్‌చార్జి సీహెచ్ ప్రియాంక న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులను కళాశాల ప్రిన్సిపాల్ అందజేశారు.

ప్రకాశం నగర్: చేనేత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జాంపేటలోని ఉమా రామలింగేశ్వరస్వామి కల్యాణ మండపంలో వీవర్స్ యునైటెడ్ నగర శాఖ సమావేశం జరిగింది. కార్యక్రమానికి సంఘం గౌరవ అధ్యక్షుడు కాలెపు సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొమ్మన జయకుమార్, జామిశెట్టి గాంధీ, కేకే సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలకు ముందస్తు కార్యాచరణ

రాజమహేంద్రవరం సిటీ: గోదావరి పుష్కరాలను విజయవంతం చేసేందుకు ముందస్తు కార్యాచరణ చేపట్టాలని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఇప్పటి నుంచే ప్రణాళిక తయారు చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైళ్లలో వచ్చే భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకొని, ముందుగానే అక్కడ పరిస్థితులను అవగాహన చేసుకోవాలన్నారు. అవసరాన్ని బట్టి ధవళేశ్వరం వైపు నుంచే వచ్చే ట్రాఫిక్‌ను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఘాట్లకు వెళ్లే మార్గాలకు సంబంధించి రోడ్ రూట్ మ్యాప్‌లు, ప్రస్తుతం ఉన్న రోడ్లకు అనుగుణంగా నూతన రహదారుల ఏర్పాటు, ట్రాఫిక్ డైవర్షన్‌పై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. బయటి నుంచి వచ్చే వాహనాలను నిర్దేశించిన ప్రదేశాల్లో ఆపి, అక్కడి నుంచి భక్తులను బస్సుల్లో పంపించేలా ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యను అధిగమించవచ్చునన్నారు. గోదావరి పుష్కరాలకు సంబంధించి ఏర్పాటు చేసిన అన్ని కమిటీలు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పక్కా ప్రణాళికతో ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎస్పీ డి.నరసింహ కిషోర్, కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్ఎంసీ ఎస్ఈ జి.పాండురంగారావు, ఆర్అండ్‌బీ ఈఈ ఎస్‌వీబీ రెడ్డి, డీపీవో ఎం.రాంబాబు, ఏపీఎస్ఆర్టీసీ డీపీటీవో ఎం.షర్మిలా అశోక, టీడీవో కేఎస్ఎంవీ కృష్ణారావు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

వీడని ముంపు.. తరచూ ముప్పు

- ముంపు బారిన శ్రీరంగపట్నం
- సూరంపాలెం ప్రాజెక్టు అదనపు జలాలతో ప్రమాదం
- పొంగుతున్న బురదకాలువ

మధురపూడి: కళాకారులకు నిలయమైన శ్రీరంగపట్నం గ్రామాన్ని బురద కాలువ ముంపు సమస్య వేధిస్తోంది. అధికంగా వర్షాలు కురిసినా, బురద కాలువలోకి అదనపు జలాలు చేరినా ఈ గ్రామం ముంపు బారిన పడుతుంది. ప్రస్తుతం గంగవరం మండలం సూరంపాలెంలోని ప్రాజెక్టు నుంచి అదనపు జలాలను విడుదల చేయడంతో శ్రీరంగపట్నం ముంపునకు గురైంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మేజర్ పంచాయతీ

కోరుకొండ మండలంలోని మేజర్ పంచాయతీలలో శ్రీరంగపట్నం ఒకటి. ఈ గ్రామానికి రాజకీయంగా ఎంతో ప్రాధాన్యం ఉంది. మండల ప్రజా పరిషత్‌లో ఈ గ్రామానికి చెందిన నాయకులు కీలక పదవులు నిర్వహించారు. ఈ గ్రామంలో సుమారు 10, 500 మంది జనాభా ఉన్నారు. ఈ గ్రామాన్ని ఆనుకుని బురద కాలువ ప్రవహిస్తుంది. కాలువ పొంగితే గ్రామంలోని బీసీ, ఎస్సీపేటలు ముంపు బారిన పడతాయి. ప్రధాన కాలువ నుంచి కాపవరంలో చెరువుకు నీరు సరాఫరా అయ్యే కాలువకు ఆనుకొని బీసీ, ఎస్సీపేటలు ఉన్నాయి.

నెల్లిపూడి వాగు

బురద కాలువకు తోడు గంగవరం మండలం నెల్లిపూడి వాగు ఉధృతంగా ప్రవహించినా శ్రీరంగపట్నానికి ముంపు ముప్పు తప్పదు. కొండల పైనుంచి వచ్చే నీటితో నెల్లిపూడి వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆకస్మాత్తుగా వరదనీటితో పోటెత్తుతుంది. దీని ప్రభావంతో శ్రీరంగపట్నం, మునగాల గ్రామాల్లోని పొలాలు నీటమునుగుతాయి. ఇది గోకవరం మండలం కామరాజుపేట వద్ద బురద కాలువలో కలుస్తోంది. అక్కడి నుంచి దీన్ని పెద్ద కాలువ అని కూడా పిలుస్తారు. గోకవరం మండలంలోని గోకవరం, అచ్యుతాపురం మీదుగా శ్రీరంగపటాన్నికి చేరుతోంది. అక్కడి నుంచి మునగాలలోని తొర్రిగెడ్డ కాలువ ద్వారా గోదావరిలో కలుస్తుంది.



శ్రీరంగపట్నంలో జలమయమైన వీధి

అదనపు జలాలతో..

వర్షాల కారణంగా అటవీ ప్రాంతం నుంచి వాగుల ద్వారా వచ్చిన నీరు అధికంగా సూరంపాలెం జలాశయంలోకి చేరుతోంది. జలాశయం నిండిపోతే అదనపు జలాలను కిందకు విడుదల చేస్తారు. సాధారణంగా 900 నుంచి 1,500 క్యూసెక్కుల వరకూ విడుదలైనా ఇబ్బంది ఉండదు. కానీ ఇప్పుడు దాదాపు 2 వేల క్యూసెక్కులు విడుదల చేయడంతో బురద కాలువకు నీటి ఉధృతి పెరిగి శ్రీరంగపట్నం ముంపునకు గురైంది. దాదాపు 5 వేల ఎకరాల్లో పంటపొలాలు, 20 వీధులు మునిగాయి. ఎస్సీ, బీసీ పేటల్లోని 600 ఇళ్ల మధ్యకు వరద నీరు చేరింది.



ఉధృతంగా ప్రవహిస్తున్న బురద కాలువ

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవ

బురద కాలువకు ఇరువైపులా 10 మీటర్లు ఎత్తున రక్షణ గోడ నిర్మించడం ద్వారా ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపవచ్చు. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రూ.14 కోట్ల గ్రాంట్లు సాధించారు. దానికి సంబంధించిన పనులు వేసవిలో ప్రారంభమవుతాయి. రక్షణ గోడ నిర్మాణం చేపట్టి మంపు సమస్యకు చరమగీతం పాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ముంపు కారణంగా వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

బైక్ పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

కంబాలచెరువు: మోటారుసైకిల్ నుంచి జారిపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలమూరు మండలం జొన్నాడ చెందిన టి.సూరిబాబు (48) వండ్రంగి పనిచేస్తుంటాడు. మేస్త్రితో కలిసి పని నిమిత్తం రాజమహేంద్రవరం వచ్చాడు. మోటారు సైకిల్‌ను మేస్త్రి నడుపుతుండగా, వెనుక సూరిబాబు కూర్చున్నాడు. ఆర్ట్స్ కళాశాల వద్దకు వచ్చేసరికి రోడ్డుకు అడ్డంగా అంబోతు వచ్చింది. ఆ సమయంలో ద్విచక్రవాహనం నడుపుతున్న మేస్త్రి దానిని తప్పించబోయాడు. ఈ ఘటనలో వెనుక కూర్చున్న సూరిబాబు కిందపడిపోయాడు. అతడి తలకు తీవ్రంగా గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అతను అక్కడ చికిత్సపొందుదూ మృతి చెందాడు.

కొత్త డిజైన్లతో చేనేత ఉత్పత్తులకు ఆదరణ

పెదపూడి: మార్కెట్లోని వినియోగదారులను ఆకర్షించేలా కొత్త డిజైన్లతో, విభిన్న రంగులతో తయారు చేస్తే చేనేత ఉత్పత్తులకు ఆదరణ లభిస్తుందని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. అనపర్తి మండలం పులుగుర్తలోని చేనేత పారిశ్రామిక ఉత్పత్తి కేంద్రంలో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ చేనేత తయారీలో కాలానుగుణంగా కొత్త డిజైన్లు రూపొందించి అభివృద్ధి చెందాలని చేనేత కార్మికులకు సూచించారు.